సాక్షి ప్రకాశం

సోమవారం । 7 । అక్టోబర్ । 2024



మాజీ సర్పంచ్‌పై హత్యాయత్నం

పొదిలి మండలం మాదాలవారిపాలెం మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు పెమ్మని ఓంకార్‌పై హత్యాయత్నం - 8లో.. కలకలం రేపింది.



మూలగుంటపాడులో భారీ చోరీ

సింగరాయకొండ మండలం మూలగుంట పాడులో ఓ ఇంట్లో రూ.40 లక్షల విలువైన బంగారం, నగదు, వెండి చోరీకి గురైంది. - 8లో..

గరిష్టం/కనిష్టం 34/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

భైరవకోనలో చండీహోమం



భైరవకోనలో గాయత్రీదేవి అలంకరణలో త్రిముఖదుర్గాదేవి

సీఎస్‌పురం(పామూరు): ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన మండలంలోని భైరవకోనలో దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఆదివారం నాల్గవరోజు త్రిముఖ దుర్గాదేవి అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భైరవకోనలో చండీహోమం, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించగా పూజా కార్యక్రమంలో ఈఓ డి.వంశీకృష్ణారెడ్డి, ముప్పాళ్ల శ్యామ్‌సుందర్‌రాజు, సర్పంచ్ కొండూరి కొండయ్య, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



భైరవకోనలో చండీహోమంలో పూర్ణాహుతి కార్యక్రమంలో ఈఓ, నాయకులు, భక్తులు

టెట్‌కు 177 మంది గైర్హాజరు

ఒంగోలు: టీచర్స్ ఎలిజిబులిటీ టెస్టు (టెట్)కు జిల్లా వ్యాప్తంగా 177 మంది ఆదివారం గైర్హాజరయ్యారు. ఒంగోలులో రెండు సెంటర్లు, మార్కాపురంలోని శామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కాలేజీలో మాత్రమే పరీక్షలు జరిగాయి. ఉదయం 465 మందికి గాను 369 మంది హాజరుకాగా, సాయంత్రం 47 మందికిగాను 387 మంది మాత్రమే హాజరయ్యారు. ఉదయం పరీక్షకు 96 మంది, సాయంత్రం పరీక్షకు 81 మంది గైర్హాజరైనట్లు డీఈవో వి.సుభద్ర తెలిపారు. సాయంత్రం జరిగిన పరీక్షలో ఇద్దరు విద్యార్థులు రెండోసారి టెట్ పరీక్షకు హాజరైనట్లు గుర్తించి వారిని పరీక్షలకు అనుమతించలేదు.

కూష్మాండ దుర్గగా త్రిపురసుందరీదేవి



శేష వాహనముపై శ్రీబాలా త్రిపురసుందరీదేవి

త్రిపురాంతకం: జిల్లాలోని ప్రముఖ శక్తి క్షేత్రమైన త్రిపురాంతకంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా బాలాత్రిపురసుందరీదేవి అమ్మవారు కూష్మాండదుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకారాలతో పాటు వాహన సేవలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం కూష్మాండ దుర్గ అలంకారంలో శేషవాహన సేవను భక్తులు వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు ఉత్సవంలో పాల్గొన్నారు. సోమవారం పంచమి రోజున స్కంద మాత అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. మయూర వాహనంపై శ్రీబాలాత్రిపుర సుందరీదేవి ఉత్సవం నిర్వహిస్తారు.

వెలిగొండ నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలి



గ్రామంలో నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

మార్కాపురం: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు వెంటనే ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని రైతు సంఘం నేత, నిర్వాసిత సంఘం కార్యదర్శి గాలి వెంకటరామిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గొట్టిపడియలో ఆయన నిర్వాసితులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు గత ఎన్నికల ప్రచారంలో తాను అధికారంలోకి వస్తే ఆర్‌ఆర్ ప్యాకేజీ కింద ప్రతి కుటుంబానికి రూ.18 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చిన సంగతిని ఆయన గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా వెలిగొండ గురించి పట్టించుకోలేదని విమర్శించారు. నిర్వాసితుల తరపున ఈనెల 21న అమరావతిలో ప్రభుత్వం వద్దకు రాయబారానికి వెళ్తామని అన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వెంకటరెడ్డి, లక్ష్మయ్య, అబ్రహాం, చిన్నలక్ష్మయ్య, వెంకట నారాయణ, యోహాన్, డేవిడ్ పాల్గొన్నారు.

ఆగస్టు 27వ తేదీ రాత్రి సమయంలో ఓ వ్యక్తికి అనారోగ్యంగా ఉండటంతో మార్కాపురంలోని జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్య సిబ్బంది మెరుగైన చికిత్స కోసం ఒంగోలుకు రెఫర్ చేశారు. ఆ సమయంలో ప్రైవేటు అంబులెన్స్‌ను మాట్లాడుకోమని వైద్యశాలలో పనిచేసే సిబ్బంది ప్రైవేటు అంబులెన్స్ నిర్వాహకునికి ఫోన్‌చేసి పిలిపించాడు. సదరు రోగి ఒంగోలుకు వెళ్లాలని తెలపగా రూ.10 నుంచి రూ.12 వేల వరకూ అవుతుందని చెప్పారు. దీంతో రోగికి సంబంధించిన బంధువులు చేసేదేమీలేక చివరగా రూ.10 వేలకు బేరం మాట్లాడి ఒంగోలుకు తీసుకెళ్లారు.

గత నెల 30వ తేదీ మధ్యాహ్నం జీజీహెచ్‌లో అనారోగ్యంతో వ్యక్తి మృతి చెందాడు. మృతదేహాన్ని జీజీహెచ్ నుంచి కిలోమీటర్ దూరంలో ఉన్న మార్కాపురం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఎన్‌ఎస్‌నగర్‌కు తీసుకెళ్లేందుకు ప్రైవేటు అంబులెన్స్ యజమానికి తెలిపారు. ఇందుకు గాను రూ.4 వేలు డిమాండ్ చేశాడు. దీంతో చేసేదేమీ లేక రూ.2500 కు మాట్లాడుకుని తీసుకెళ్లాడు.

ఎవరైనా చనిపోతే బాధపడతారు. కానీ వారికి మాత్రం పండగే.. అవసరాన్ని క్యాష్ చేసుకోవడంలో ఆరితేరారు. మనిషి చావును కూడా ఆ సమయంలో తమకు అనుకూలంగా మార్చుకుని డబ్బులు డిమాండ్ చేస్తూ చనిపోయిన వారి రక్తాన్ని పీలుస్తున్నారు ప్రైవేటు అంబులెన్స్‌ల నిర్వాహకులు. ఒక టీడీపీ నేత అండతో మార్కాపురం జీజీహెచ్ ప్రాంగణంలోనే ప్రైవేటు అంబులెన్స్‌లను ఉంచి మృతదేహాలతో వ్యాపారం చేస్తూ బాధితులకు కంటతడి పెట్టిస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే మా యూనియన్ మా ఇష్టం.. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి.. మేము తప్ప ఇక్కడికి ఎవరైనా వస్తే వారి అంతుచూస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారు.



● అంబులెన్స్ మాఫియా...

శవాల్ని పీల్చే జలగలు

- శవాలతో అంబులెన్స్ నిర్వాహకుల వ్యాపారం
- అవసరాన్ని బట్టి రూ.15 నుంచి రూ.20 వేలు డిమాండ్
- చనిపోతే వారికి పండగే..
- యూనియన్ పేరుతో దౌర్జన్యం.. బెదిరింపులు
- జీజీహెచ్‌లోనే పార్కింగ్

మార్కాపురం: మార్కాపురం జీజీహెచ్ ప్రాంగణంలో ప్రైవేటు అంబులెన్స్ నిర్వాహకుల దందాలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయి. శవాలపై పేలాలు ఏరుకునేలా ఆపద సమయంలో అవతల వ్యక్తుల అవసరాలను క్యాష్ చేసుకుంటూ డబ్బులు దండుకుంటున్నారు. మనిషి ప్రాణాలను పోగొట్టుకుని వారి కుటుంబ సభ్యులు పుట్టెడు దుఃఖంలో ఉండి మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లేందుకు గత్యంతరం లేక అంబులెన్స్ నిర్వాహకుల వద్దకు వెళితే వారు చెప్పే రేటుచూసి బంధువుల గుండె గుభేలుమంటోంది. హద్దు.. పద్దు లేకుండా డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఆ సమయంలో తప్పనిసరి పరిస్థితుల్లో మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లాలనే ఆతృతతో బేరం ఆడకుండా అప్పోసొప్పో.. చేసి తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూత వేటు దూరమైనా వారి చెప్పిన రేటే ఫైనల్ అన్నట్టుగా అంబులెన్స్ యజమానులు వ్యవహరిస్తున్నారు. వీరి వ్యవహారాన్ని కట్టుదిట్టం చేయాల్సిన జీజీహెచ్ అధికారులు, సిబ్బంది ఇవేమీ తమకు పట్టనట్టు వ్యవహరిస్తుండటంతో ప్రైవేటు అంబులెన్స్ యజమానుల ఆగడాలకు అడ్డులేకుండా పోయింది. జీజీహెచ్‌కు సాధారణంగా పేద, మధ్య తరగతి ప్రజలు ఆరోగ్యం కోసం వెళ్తుంటారు. వారికి కష్టం వస్తే అంతో ఇంతో చేదోడుగా ఉండి ఆపద సమయంలో అవసరమైన చోటికి తీసుకెళ్లాల్సిన అంబులెన్స్ సిబ్బంది కూటమి కట్టి దోచుకుంటున్నారు.

మార్చురీ సిబ్బంది డిమాండ్..

వైద్యశాలలో పనిచేస్తున్న మార్చురీ సిబ్బందికి అంబులెన్స్, డెడ్‌బాడీ ఫ్రీజర్ ఉంది. ఎవరైనా యాక్సిడెంట్‌కు గురై వైద్యశాలకు వచ్చి చికిత్స పొందుతూ మృతి చెందితే తన అంబులెన్స్ వాడుకోకపోతే పోస్టుమార్టం చేయడంలో కాలయాపన చేయడంతోపాటు వారిపై దురుసుగా ప్రవర్తిస్తుండటంతో పలువురు ఇతని తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ఎవరైనా చనిపోతే డెడ్‌బాడీ ఫ్రీజర్ కోసం మార్చురీ సిబ్బందిని సంప్రదిస్తుంటారు. దీంతో మార్చురీ సిబ్బంది బంధువు డెడ్‌బాడీ ఫ్రీజర్‌తో అక్కడ వాలిపోతాడు. మృతదేహాన్ని ఫ్రీజర్ బాక్స్‌లో ఉంచి అనంతరం మళ్లీ ఫ్రీజర్ బాక్సు తీసుకెళ్లే సమయంలో రూ.10 వేల వరకూ డిమాండ్ చేస్తాడు.

సేవల ముసుగులో...

ఎవరైనా ఆరోగ్యం బాగోలేక జీజీహెచ్‌కు వస్తున్నారంటే ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్లు అక్కడ వాలిపోయి కుటుంబ సభ్యులకు ఆసరాగా సేవలు చేస్తున్నట్టు నటిస్తుంటారు. రోగిని పరీక్షించిన వైద్య సిబ్బంది మెరుగైన చికిత్స కోసం ఒంగోలు, గుంటూరు, విజయవాడ తదితర ప్రాంతాలకు రెఫర్ చేసినట్లయితే అప్పటి నుంచి వీరి వ్యాపారం ప్రారంభమవుతుంది. దూరాన్ని బట్టి రూ.15 నుంచి రూ.20 వేలు డిమాండ్ చేస్తారు. వీరి అంబులెన్స్ కాక ఇతర అంబులెన్స్‌లను మాట్లాడుకుంటామంటే అడ్డుపడి వైద్యశాల ప్రాంతాల్లోకి ఇతర అంబులెన్స్‌లను రానివ్వమని, తమ అంబులెన్స్‌లను మాత్రమే వినియోగించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

జీజీహెచ్ ఆవరణలో ప్రైవేటు అంబులెన్స్‌లు పార్కింగ్...

ఎక్కడైనా ప్రైవేటు అంబులెన్స్‌లు హాస్పిటల్ బయట ఒక ప్రదేశంలో ఉంటాయి. కానీ మార్కాపురంలో మాత్రం అందుకు విరుద్ధంగా జీజీహెచ్ ఆవరణలో ఓపీ విభాగానికి అతిసమీపంలో ఉండటం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. జీజీహెచ్ సిబ్బంది సహకారంతోనే ప్రైవేటు అంబులెన్స్ సిబ్బంది తమ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని రోగుల బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మార్కాపురం జీజీహెచ్



జీజీహెచ్ ఆవరణలో ఉన్న ప్రైవేటు అంబులెన్స్‌లు

అధికంగా డిమాండ్ చేస్తున్నారు



ఇటీవల మా బంధువు అనారోగ్యంతో జీజీహెచ్‌లో చనిపోతే అక్కడి నుంచి పట్టణంలోని ఇంటికి తీసుకొచ్చేందుకు రూ.4 వేలు అడిగారు. బేరం ఆడి రూ.2500 ఇచ్చాం. కనీసం కిలోమీటర్ దూరం కూడా ఉండదు. ఇందుకు ఇంత మొత్తం డిమాండ్ చేయడం బాధాకరం. అంబులెన్స్ మాఫియాను అరికట్టాలి.

– జీ అశోక్‌కుమార్, మృతురాలి బంధువు, మార్కాపురం.

రాయితీకి కత్తెర

- పప్పు శనగ విత్తన రాయితీకి కోతపెట్టిన కూటమి ప్రభుత్వం
- ఏకంగా 25 శాతానికి కుదింపు
- రైతులకు క్వింటాపై గతేడాది కన్నా రూ.2,370 భారం

బేస్తవారిపేట: అన్నదాతలకు పప్పు శనగ విత్తనాల కొనుగోలు భారంగా మారనుంది. ఇప్పటికే పెట్టుబడి సాయం అటకెక్కించడంతో పాటు గతేడాదికి సంబంధించిన ఉచిత పంటల బీమా కింద రావాల్సిన పరిహారంపై కూడా కూటమి సర్కారు నోరు మెదపడం లేదు. దీనికి తోడు విత్తన పప్పుశనగపై అందించే రాయితీని కుదించేసింది. గతేడాది, ఈ ఏడాది కరువు పరిస్థితుల కారణంగా ఇబ్బంది పడుతున్న తరుణంలో సబ్సిడీ పెంచి విత్తన పప్పుశనగ అందించాల్సింది పోయి సబ్సిడీ కుదించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పప్పుశనగపై 25 శాతం రాయితీ...

రబీలో పప్పుశనగ సాగు చేసే రైతులకు రాయితీతో విత్తనం పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయశాఖ ప్రకటించింది. అయితే రాయితీ 25 శాతం మాత్రమేనని ప్రకటించారు. బయటి మార్కెట్‌లో క్వింటా పప్పుశనగ రూ.7 వేల నుంచి రూ.7500 ధర పలుకుతోంది. ప్రభుత్వం రూ.9,400, రూ.12,100 ధరను పెట్టింది. జేజీ-11 క్వింటా పూర్తి ధర రూ.9,400 కాగా అందులో 25 శాతం రాయితీ రూ.2,350 పోను క్వింటాకు రూ.7,050 రైతులు చెల్లించాల్సి ఉంది. కేఏకే-2 రకం క్వింటా రూ.12,100 కాగా రాయితీ రూ.3025 పోను రూ.9075 రైతు చెల్లించాలి. ఒక్కో రైతుకు గరిష్టంగా 200 కిలోలు అంటే 2 క్వింటాళ్లు పంపిణీ చేయనున్నారు. ఒక ఎకరా ఉన్న రైతులకు 40 కిలోలు, రెండు ఎకరాలకు 80 కిలోలు, ఐదు ఎకరాలు ఉన్న రైతులకు 200 కేజీలు పంపిణీ చేయాలని నిర్ణయించారు.

గతేడాది 40 శాతం రాయితీ..

గత రబీలో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేసింది. ఏటా క్రమం తప్పకుండా రైతు భరోసా-పీఎం కిసాన్ అందించింది. జూలై నెలలోపే ఉచిత పంటల బీమా కింద పెద్ద ఎత్తున పరిహారం కూడా అందించింది. అలాగే రబీలో విత్తన పప్పుశనగపై గతేడాది 40 శాతం రాయితీ అందించింది. క్వింటా రూ.8,100 కాగా అందులో 40 శాతం రూ.3,240 పోనూ రైతుల వాటా కింద రూ.4,680 ప్రకారం కట్టించుకున్నారు.



కరువులో సబ్సిడీ తగ్గించడం దారుణం



రెండేళ్లుగా సకాలంలో వర్షాలు పడటంలేదు. పప్పు శనగ సబ్సిడీ గత ఏడాది 40 శాతం ఇచ్చారు. ఇప్పుడు 25 శాతానికి తగ్గించడంతో అధిక ధర పెట్టి విత్తనాలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. బయటి మార్కెట్‌కు మించి విత్తన పప్పుశనగ కొనుగోలుకు ప్రభుత్వం నిబంధనలు విడుదల చేయడం దారుణం.

– జే కోటయ్య, మల్లాపురం

రివ్యూ పిటిషన్ల తిరస్కరణ రాజ్యాంగ వ్యతిరేకం

ఒంగోలు:

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని కోరుతూ దాఖలు చేసిన రివ్యూ పిటిషన్ల తిరస్కరణ మోదీ, ఆర్‌ఎస్‌ఎస్ కుట్రలో భాగమే అని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు పేర్కొన్నారు. స్థానిక బీఎస్‌ఎన్‌ఎల్ సేవా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రివ్యూ పిటీషన్ల తిరస్కరణ రాజ్యాంగ వ్యతిరేకంగా పేర్కొన్నారు. ఈ తీర్పు దేశంలో ఉన్న ఎస్సీ, ఎస్టీలను అభివృద్ధికి, అధికారానికి దూరంగా ఉంచడానికి ఇచ్చిన తీర్పు అని, దీనిని అంబేడ్కర్ వాదులు వ్యతిరేకించాలన్నారు. ఏపీ మాల ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ధర్నాశి చిరంజీవి మాట్లాడుతూ మాల ఉద్యోగులపై నేటికి ప్రధాన నగరాల్లో వివక్ష కొనసాగుతుందన్నారు. ఇల్లు అద్దెకు ఇచ్చే దగ్గర, అపార్టుమెంట్లలో ప్లాట్లు కొనే దగ్గర, అపార్టుమెంట్లలోని కమిటీల వద్ద అనేక వివక్షలకు గురవుతున్నారన్నారు. ఉద్యోగులుగా తాము ఇన్ని వివక్షలకు గురవుతుండగా, సామాన్య జనం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దేశంలో మత గణన, కుల గణన చేయాలన్నారు. అర్హులందరికీ భూపంపిణీ జరగాలన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకునే పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, డిసెంబర్ 14న గుంటూరులో జరిగే మాలల రణగర్జనను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో దళిత మహాసభ రాష్ట్ర కార్యదర్శి సంపత్‌కుమార్ చిట్టిమాల, మాల ఉద్యోగుల ఉమ్మడి ప్రకాశం జిల్లా చైర్మన్ ఎరిచర్ల సుబ్రహ్మణ్యం, ఉద్యోగ సంఘాల నాయకులు అంగలకుర్తి సుబ్బారావు, మాలమహానాడు నాయకులు మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు

ఆగిన ఊపిరి..ఖాకీల పంచాయితీ..

- పోలీసుల వేధింపులతో ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి
- వారం రోజులుగా చావుబతుకులతో పోరాడిన రాజశేఖర్
- జీజీహెచ్ ఆవరణలో పోలీసుల సమక్షంలో కేసు రాజీ

ఒంగోలు టౌన్: పోలీసుల చిత్రహింసలు తాళలేక మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన పరుచూరి రాజశేఖర్ (35) వారం రోజుల పాటు చావుబతుకులతో పోరాడి ఆదివారం మృతిచెందాడు. నగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు తుదిశ్వాస విడిచాడు. పొన్నలూరుకు చెందిన రాజశేఖర్ కొంతకాలంగా ఒంగోలులోని సమతా నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఆయన కొత్తపట్నం మండలం వజ్జిరెడ్డిపాలెంలోని వింటాస్ హేచరీస్‌లో 2020 నుంచి 2022 వరకు మేనేజర్‌గా పనిచేశాడు. 2022 జులై 10వ తేదీ ఉద్యోగం మానుకున్నాడు. అప్పటికే కంపెనీకి చెందిన లావాదేవీలు, ఇతర వ్యవహారాలకు సంబంధించి రూ.4 కోట్లకు పైగా నిధులను దుర్వినియోగం చేసినట్లు వింటాస్ యజమాని కొత్తపట్నం పోలీసులను ఫిర్యాదు చేశారు. పెద్ద మనుషుల పంచాయితీతో అంతా సద్దుమణిగింది. ఆ తరువాత ఇటీవల రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వింటాస్ సుధాకర్ ఈ కేసును కదిలించారు. దీంతో ఈ ఏడాది సెప్టెంబర్ 17వ తేదీ రాజశేఖర్‌ను కొత్తపట్నం పోలీసు స్టేషన్‌కు పిలిపించారు. తాను ఉద్యోగం మానుకునే సమయంలోనే మొత్తం లెక్కలు అప్పగించానని రాజశేఖర్ చెప్పి వచ్చాడు. 27వ తేదీ ఒంగోలు టూ టౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు పిలిపించడంతో భార్య అంజనీదేవితో కలిసి వెళ్లి మాట్లాడారు. ఆ తరువాత కూడా రెండు రోజుల పాటు పోలీసు స్టేషన్‌కు పిలిపించి మోసం చేసినట్లు అంగీకరించాలని ఒత్తిడి చేయడమే కాకుండా బెదిరించినట్లు రాజశేఖర్, అతడి కుటుంబ సభ్యులు మీడియాతో చెప్పడం తెలిసిందే. 30వ తేదీ మళ్లీ పోలీసు స్టేషన్‌కు పిలిపించడంతో రాజశేఖర్ ఒక్కడే వెళ్లాడు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో పోలీసు స్టేషన్‌కు వెళ్లిన అతడు తిరిగి రాక పోయే సరికి అనుమానం వచ్చిన రాజశేఖర్ భార్య అంజనీదేవి సాయంత్రం 6 గంటలకు ఫోన్ చేశారు. స్విచాఫ్ అని రావడంతో అతడి మిత్రుడిని పోలీసు స్టేషన్‌కు పంపించారు. అక్కడకు వెడితే రాజశేఖర్ పోలీసు స్టేషన్లో లేడని చెప్పారు. కానీ పోలీసు స్టేషన్ బయట స్కూటర్, గది బయట చెప్పులు కనిపించాయి. దాంతో పోలీసులని ప్రశ్నించడంతో రాజశేఖర్ లోపల ఉన్నాడని పంపించారు. గది నుంచి బయటకు వచ్చిన రాజశేఖర్ తనను ఏఎస్‌ఐ చిరంజీవి, కానిస్టేబుల్ శ్రీనివాసరావు కొట్టారని, పిరుదులు, కాళ్ల మీద లాఠీలతో చితకబాదారని, మోసం చేసినట్లు అంగీకరించాలని ఒత్తిడి చేసి సంతకాలు తీసుకున్నారని తెలిపారు. పోలీసులు కొట్టడంతో మనస్తాపానికి గురైన అతడు మరుసటి రోజు ఇంట్లో వాళ్లకు తెలియకుండా ఎలుకల మందు తీసుకొని ఆత్మహత్యా యత్నం చేశాడు. వాంతులు చేసుకుంటుండంతో అనుమానం వచ్చి ప్రశ్నించగా ఎలుకల మందు తీసుకున్నట్లు తెలిపాడు. వెంటనే అతడిని జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నా శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఆరోగ్యం విషమించింది. దాంతో మెరుగైన చికిత్స కోసం శుక్రవారం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ నుంచి శనివారం సాయంత్రం ఒంగోలులోని ఒక ప్రైవేటు వైద్యశాలకు తీసుకొచ్చారు. ఆదివారం తెల్లవారుజామున ఆయన మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. రాజశేఖర్‌కు భార్య అంజనీదేవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె సుకన్య ఆరో తరగతి, చిన్న కూతురు సుష్మ నాలుగో తరగతి చదువుతోంది. రాజశేఖర్ మరణించిన సమాచారం తెలిసిన వెంటనే అతడి బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో జీజీహెచ్‌కు వచ్చారు. ఈ క్రమంలో తూర్పునాయుడు పాలేనికి చెందిన కొందరు టీడీపీ నాయకులు, పెద్ద మనుషులు పోలీసుల సమక్షంలో కేసు రాజీ చేసినట్లు సమాచారం. మృతుడు రాజశేఖర్ ఆత్మహత్య ప్రయత్నానికి ముందు 15 పేజీల సూసైడ్ నోట్ రాసినట్లు తెలుస్తోంది.

పోలీసుల చిత్రహింసల వల్లే రాజశేఖర్ ఆత్మహత్య :

ఒంగోలు టూ టౌన్ పోలీసులు కొట్టడం వల్లనే పరుచూరి రాజశేఖర్ ఆత్మహత్య చేసుకున్నట్లు దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు ఆరోపించారు. జీజీహెచ్‌లో ఉన్న రాజశేఖర్ మృతదేహాన్ని పరిశీలించిన ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ నాయకుల మెప్పు కోసం పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి థర్డ్ డిగ్రీ ప్రయోగించడం దారుణమన్నారు. రాజశేఖర్ మరణాన్ని కస్టోడియల్ డెత్‌గా పరిగణించాలని డిమాండ్ చేశారు.



మార్చురీలో రాజశేఖర్ మృతదేహం



ఆస్పత్రి ఆవరణలో పోలీసుల సమక్షంలో రాజీ చేస్తున్న పెద్దలు

రాజశేఖర్ మృతి కేసుపై ఎస్పీ సీరియస్

● వీఆర్‌కు ఏఎస్‌ఐ చిరంజీవి, కానిస్టేబుల్ శ్రీనివాసరావు

పరుచూరి రాజశేఖర్ ఆత్మహత్య చేసుకునేందుకు కారణమైన పోలీసులపై ఎస్పీ ఏఆర్ దామోదర్ సీరియస్ అయ్యారు. సివిల్ వివాదంలో తలదూర్చి బాధితుడిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన టూటౌన్ ఏఎస్‌ఐ చిరంజీవి, కానిస్టేబుల్ శ్రీనివాసరావులను వీఆర్‌కు పంపిస్తూ ఆదివారం రాత్రి నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసులో పోలీసుల వ్యవహరించిన తీరుపై తీవ్రమైన విమర్శలు వస్తున్నాయి.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో రెండు ఎడ్లు మృతి


మృతిచెందిన ఎడ్లు

మార్కాపురం రూరల్: విద్యుత్ షాక్‌తో రెండు ఎడ్లు మృతిచెందిన సంఘటన మార్కాపురం మండలంలోని పెద్దనాగులవరం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. బొమ్మనబోయిన కాశీరావుకు చెందిన రెండు ఎడ్లు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాయి. వాటి విలువ సుమారు 2 లక్షల రూపాయలు ఉంటుందని యజమాని తెలిపారు. తమకు జీవనాధారమైన ఎడ్లు చనిపోవడంతో రైతు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మేత మేసేందుకు గ్రామ శివార్లలో ఉన్న పొలాల్లోకి వెళ్లిన ఎడ్లలో ఒకటి ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి షాక్‌కు గురైంది. ఆ ఎద్దుకు తగిలి మరో ఎద్దు కూడా మృతిచెందింది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ఎడ్లు మృతిచెందాయని బాధిత రైతు ఆరోపించాడు.

పోగొట్టుకున్న నగదు బాధితుడికి అందజేత



బాధితుడికి నగదు అందజేస్తున్న ఎస్సై నాగమల్లీశ్వరరావు

టంగుటూరు: పోగొట్టుకున్న నగదును బాధితుడికి అందజేసిన సంఘటన ఆదివారం టంగుటూరులో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై నాగమల్లీశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. సంతనూతలపాడు మండలం గొర్లమెట్ట గ్రామానికి చెందిన మద్దినేని వెంకటేశ్వర్లు ఆదివారం ఉదయం స్వగ్రామం నుంచి సంచిలో రూ.85 వేల నగదు, వెండి గొలుసుతో బయలుదేరాడు. టంగుటూరు మండలం జమ్ములపాలెం గ్రామంలోని కూతురు వద్దకు వచ్చేందుకు టంగుటూరులో బస్సు దిగాడు. ఆటోలో జమ్ములపాలెం వెళ్లి సంచిలో ఉన్న డబ్బు, వెండి గొలుసు చూసుకోగా, కనిపించలేదు. ఎక్కడో పడిపోయిందని గుర్తించి వెంటనే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఆటో ఎక్కిన చోట పరిశీలించారు. అక్కడే పోగొట్టుకుని రోడ్డుపైనే పడి ఉండటంతో రూ.85 వేల నగదు, వెండి గొలుసును బాధితుడికి అందించారు. వేగంగా స్పందించిన హెడ్ కానిస్టేబుల్ వెంకట్రావును ఎస్సై అభినందించారు.

నారాయణస్వామికి అభిషేకోత్సవం


మహానివేదన ప్రదక్షిణోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయంలో మహానివేదన, గోపూజ, అభిషేకోత్సవ కార్యక్రమం ఆదివారం అర్చకులు మంకాల సత్యనారాయణ, శివప్రసాద్‌శర్మ వేద మంత్రాలతో ఘనంగా నిర్వహించారు. నూతన గోపూజా మందిరంలో గోపూజ నిర్వహించారు. ముందుగా శ్రీనారాయణస్వామి వారి మూలవిగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తివారి ఉత్సవ మూర్తులకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, సింగిల్‌విండో మాజీ చైర్మన్ బోయళ్ల నారాయణరెడ్డి, బొప్పూరి రమేష్, వరికూటి హనుమంతు పాల్గొన్నారు.

'హద్దు'ల్లేని మత్తు.!

- అస్తవ్యస్తంగా నూతన మద్యం పాలసీ
- లైసెన్సు పొందిన వారు ఏ ప్రాంతంలోనైనా మద్యం షాపు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి
- డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో వివాదాలకు దారి తీసే అవకాశం
- దరఖాస్తు ఫీజు, లైసెన్స్ ఫీజు ఎక్కువ కావడంతో టెండర్‌దారుల సిండికేట్
- జిల్లాలో మొత్తం 178 మద్యం దుకాణాలకు ఈ నెల 9 వరకు దరఖాస్తులు



చీమకుర్తి:

కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీ అస్తవ్యస్తంగా ఉండటంతో వివాదాలకు దారి తీసే పరిస్థితులు నెలకొంటున్నాయి. మద్యం దుకాణాలకు లైసెన్సు పొందిన వారు వారికి ఇష్టమొచ్చిన ఏ ప్రాంతంలోనైనా మద్యం షాపు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. రూరల్ ప్రాంతంలో మద్యం దుకాణాలు పొందిన వారు ఆ రూరల్ ప్రాంతంలో ఎక్కడైనా షాపు ఏర్పాటు చేసుకోవచ్చని, అర్బన్ ప్రాంతంలో మద్యం షాపునకు లైసెన్సు పొందిన వారు కూడా ఆ అర్బన్ ప్రాంతంలో ఎక్కడైనా షాపు ఏర్పాటు చేసుకోవచ్చనే విధి విధానాల కారణంగా గందరగోళం నెలకొంది. దీని వలన మద్యం విక్రయాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లోనే లైసెన్సుదారులంతా మద్యం షాపులు ఏర్పాటు చేసుకుంటే వారి మధ్య పోటీ కారణంగా గొడవలు జరిగే ప్రమాదం ఉంది. ఉదాహరణకు చీమకుర్తి రూరల్ ప్రాంతంలో 4 మద్యం దుకాణాలకు అనుమతిచ్చారు. రామతీర్థం నుంచి పొదిలి వైపు వెళ్లే కర్నూల్ రోడ్డులో ఉన్న మర్రిచెట్లపాలెంలో మద్యం విక్రయాలు జిల్లాలోనే ప్రథమ స్థానాల్లో ఉంటాయి. గతంలో జరిగిన మద్యం విక్రయాలు ఆ విషయాన్ని అనేకసార్లు రుజువు చేశాయి. ఇప్పుడు చీమకుర్తి రూరల్ ప్రాంతంలో ఏర్పాటయ్యే 4 మద్యం దుకాణాలను లాటరీ ద్వారా ఎంపికైన వారు మర్రిచెట్లపాలెంలోనే ఏర్పాటు చేసుకునేందుకు ఇష్టపడతారు. రూరల్ ప్రాంతంలో 24 పంచాయతీలు ఉన్నాయి. 24 పంచాయతీల్లో అమ్మే మద్యం మొత్తం ఒక్క మర్రిచెట్లపాలెంలోనే అమ్ముకునే అవకాశం ఉంది. బూదవాడ, మర్రిచెట్లపాలెం పరిసర ప్రాంతాల్లో దాదాపు 600 గ్రానైట్ ఫ్యాక్టరీలు, కంకర మిల్లులు, గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. వాటిలో సుమారు ప్రత్యక్షంగా పనిచేసే కార్మికులు 25 వేల మందికిపైగా మర్రిచెట్లపాలెం పరిధిలోనే నివశిస్తుంటారు. దాని వలన మర్రిచెట్లపాలెంలో మద్యం విక్రయాలకు డిమాండ్ ఉండటంతో ఆ ప్రాంతంలో మద్యం లైసెన్స్ పొందిన వారంతా షాపులు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. ఇదేవిధంగా అర్బన్ పరిధిలో కూడా బాగా డిమాండ్ ఉన్న ప్రాంతంలో ఒకే చోట మద్యం దుకాణాలు నెలకొల్పితే ఆయా దుకాణాల యజమానుల మధ్య వివాదాలు ఏర్పడతాయి. దాంతో పాటు డిమాండ్ ఉన్న ప్రాంతాల్లోనే ఎక్కువ దుకాణాలు ఏర్పాటు చేస్తే ఆయా ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజల సాధారణ జీవనానికి ఇబ్బందులు ఏర్పడతాయి. ఈ సమస్య జిల్లాలోని 178 మద్యం దుకాణాల విషయంలోనూ తలెత్తే ప్రమాదం ఉంది.

డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో లైసెన్స్ ఫీజు కూడా పెంపు...

జిల్లాలో ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, మొత్తం 31 మండలాల్లో కలిపి 178 మద్యం దుకాణాలకు ప్రభుత్వం లైసెన్స్‌లు మంజూరు చేసేందుకు ఈ నెల 9వ తేదీ వరకు దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. 2024–26కు రెండేళ్ల పాటు మద్యం దుకాణాలు పొందిన లైసెన్స్‌దారుడు షాపులు నిర్వహించుకోవచ్చు. జిల్లాలో డిమాండ్ ఉన్న ప్రాంతంలో లైసెన్స్ ఫీజు మొదటి సంవత్సరానికి రూ.65 లక్షలు, రెండో ఏడాదికి రూ.71,50,000, డిమాండ్ లేని ప్రాంతాల్లో మొదటి ఏడాదికి రూ.55 లక్షలు, రెండో ఏడాదికి రూ.60,50,000గా నిర్ణయించారు. ఏ ప్రాంతం వారికైనా తిరిగి చెల్లించని విధంగా దరఖాస్తు ఫీజును రూ.2 లక్షలుగా నిర్ణయించారు. డిమాండ్ ఉన్న ప్రాంతాలకు లైసెన్సు ఫీజును రూ.10 లక్షల వరకూ పెంచినప్పటికీ.. వ్యత్యాసం స్వల్పమే కావడంతో డిమాండ్ ఉన్న ప్రాంతాలకు పోటీ ఉండే అవకాశం ఉంది.

ఏడాదికి కనీసం రూ.కోటి ఖర్చు...

దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు మొదలు లైసెన్స్ ఫీజు రూ.65 లక్షలతో కలిపి ఏడాదికి కనీసం లైసెన్స్‌దారుడికి కోటి రూపాయలకుపైగా ఖర్చవుతుంది. షాపు అద్దె, వర్కర్ల జీతాలు, కరెంటు బిల్లులు, పెట్టిన పెట్టుబడిపై కనీసం రూపాయి వడ్డీతో కలిసి కనీసం కోటి రూపాయలకు తక్కువలో తక్కువగా వేసుకున్నా ఖర్చవుతుందని టెండర్‌దారులు లెక్కలు కడుతున్నారు. సాధారణ రాబడి మాత్రమే కాకుండా బాటిల్‌పై రూ.5 లేక రూ.10 అదనంగా వేసి అమ్ముకున్నా, బెల్ట్ షాపులు పెట్టి అక్రమంగా మద్యం విక్రయించినా షాపు యజమాని, లైసెన్స్ దారుడిపై అదనంగా కేసులు నమోదు చేసే పరిస్థితి ఉంది. అలా కేసులు లేకుండా ఉండాలంటే ఎక్సైజ్ అధికారులకు పర్సంటేజీలు లేక నెల మామూళ్లను షాపు టర్నోవర్‌ను బట్టి ఇస్తారు. అలా నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు సమర్పించుకోవాల్సి ఉంటుంది. ఇక పోలీసులు, రాజకీయ నాయకుల అండదండలు పొందుతున్నందుకు వారి కార్యక్రమాలకు సరాసరిన నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు మద్యం వ్యాపారులు ఖర్చు పెట్టాల్సి వస్తుంది. ఇలా లైసెన్స్ పొందిన వారికి ఏడాదికి రూ.1.20 కోట్ల నుంచి రూ.1.50 కోట్ల వరకు ఖర్చవుతుంది. దానిని నెలకు లెక్క గడితే రూ.12.50 లక్షల వరకు ఉంటుంది. అంటే సరాసరిన రోజుకు రూ.40 వేల విలువైన మద్యం విక్రయించాలి. అంత అమ్మినా పెట్టిన పెట్టుబడి, జీతాలు, లంచాలే తప్ప షాపు యజమానికి లాభం గురించి ఆలోచించే అవకాశం తక్కువే. అసలు ఇంత పెద్ద మొత్తంలో రోజుకు రూ.40 వేల విలువైన మద్యం విక్రయించడం సాధ్యమేనా.? అని, లాభాలు పక్కన పెట్టినా.. కనీసం పెట్టుబడి అయినా వస్తుందో లేదోననే అనుమానాల మధ్య టెండర్ వేద్దామా..వద్దా.? అనే సందేహంతో మద్యం టెండర్‌దారులు ఊగిసలాడుతున్నారు.

దరఖాస్తు ఫీజు తిరిగి రాదనే ఉద్దేశంతో సిండికేట్...

దరఖాస్తు ఫీజు కింద చెల్లించిన రూ.2 లక్షలు లాటరీలో షాపు వచ్చినా..రాకున్నా తిరిగి రాదు. ఒకే ఒక్క దరఖాస్తు చేస్తే లాటరీలో తమ పేరు తగులుతుందో లేదో తెలియదు. అందుకే డబ్బున్న వ్యాపారులు ఒకే దుకాణానికి 10 దరఖాస్తులు టార్గెట్‌గా చేసుకుని రూ.20 లక్షలతో 10 బినామీ పేర్లతో దరఖాస్తు చేస్తున్నారు. లాటరీ తీస్తే కనీసం తమది ఒక్కపేరైనా తగలకుండా ఉంటుందా.. అనే నమ్మకంతో దరఖాస్తు చేస్తున్నారు. మరికొంత మంది మాత్రం తాము 10 పేర్లతో 10 దరఖాస్తులు చేసినా... ఎవరైనా ఒకటే దరఖాస్తు చేసి వారికే లాటరీలో షాపు తగిలితే పరిస్థితి ఏంటని భయాందోళన చెందుతున్నారు. అందుకే కొంత మంది మద్యం టెండర్‌దారులు కనీసం 10 మంది కలిసి ఒక్కొక్కరు ఒక్కొక్క దరఖాస్తు వేద్దాం... పది మందిలో షాపు ఎవరికి తగిలినా అందరం కలిసి ఆ షాపు నిర్వహించుకుందామంటూ సిండికేట్ అవుతున్నారు. మద్యం టెండర్లలో ఇప్పటి వరకు ప్రభుత్వం అనుకున్నంత స్పందన రాలేదనటానికి చీమకుర్తి ఎక్సైజ్ సర్కిల్‌లోని మద్యం దరఖాస్తులే నిదర్శనం. ఈ నెల 1 నుంచి 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంటే.. 1, 2 తేదీల్లో ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. 3వ తేదీ కేవలం 3 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. 4వ తేదీ సర్వర్ ఆగిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. 9వ తేదీ వరకు మద్యం టెండర్లలో ఎలాంటి సిండికేట్ రాజకీయాలు జరుగుతాయో అని వ్యాపారులు ఆసక్తిగా చూస్తున్నారు.

షాపును ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చు :

లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు లాటరీలో షాపు వస్తే అర్బన్ కేటగిరీలో వారు అర్బన్‌లో ఎక్కడైనా, రూరల్ కేటగిరీ వారు రూరల్ ప్రాంతంలో ఎక్కడైనా షాపు పెట్టుకోవచ్చు. ఒకే ప్రాంతంలో ఎంత మంది లైసెన్సుదారులైనా షాపులు ఏర్పాటు చేసుకోవచ్చు.

సుకన్య, ఎక్సైజ్ సీఐ, చీమకుర్తి

మాజీ సర్పంచ్‌పై హత్యాయత్నం

- తీవ్రంగా గాయపడిన ఓంకార్
- గుంటూరు వైద్యశాలకు తరలింపు

పొదిలి: మండలంలోని మాదాలవారిపాలెం మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు పెమ్మని ఓంకార్‌పై హత్యాయత్నం జరిగింది. తీవ్ర గాయాలపాలైన ఓంకార్‌ను గుంటూరు వైద్యశాలకు తరలించారు. రియల్ ఎస్టేట్ వ్యవహారాలే ఇందుకు కారణంగా భావిస్తున్నారు. ఆ వివరాల ప్రకారం.. విశ్వనాథపురం బ్యాంకు కాలనీలో ఓంకార్ నివాసం ఉంటున్నారు. శనివారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఇంటికి వెళ్తున్నారు. ఆ సమయంలో దారికాసిన గుర్తు తెలియని వ్యక్తులు అతనిపై దాడి చేశారు. ఇనుప రాడ్లతో తలపై విచక్షణా రహితంగా కొట్టారు. దీంతో ఓంకార్ కిందపడిపోయాడు. చనిపోయాడనుకున్న దుండగులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కేకలు వినిపించడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకున్నారు. తొలుత ఓంకార్ సోదరుడు వెంకటేశ్వర్లుకు ఫోన్‌లో సమాచారం ఇవ్వడంతో అతను 108కు ఫోన్ చేశాడు. ఓంకార్‌ను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. తలకు తీవ్రంగా గాయాలవడంతో ఐసీయూలో ఉంచి చికిత్స చేస్తున్నట్లు బంధువులు తెలిపారు. రియల్ ఎస్టేట్ లావాదేవీల కారణంగానే ఈ హత్యాయత్నం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. స్థానికంగా ఉండే కొందరికి, ఓంకార్‌కు ఇటీవల వివాదం జరిగిందని, వారే కిరాయి వ్యక్తుల ద్వారా హత్య చేయించేందుకు పూనుకున్నారని భావిస్తున్నారు. సంఘటన స్థలాన్ని ఎస్సై వేమన పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని వేమన తెలిపారు. కాగా, పొదిలిలో ఓ కిరాయి హత్య జరిగి రెండు నెలలు గడవకముందే మరో పర్యాయం కిరాయి వ్యక్తులు దాడికి తెగబడటం సంచలనంగా మారింది.


గాయపడిన ఓంకార్


సంఘటన స్థలంలో విచారిస్తున్న ఎస్సై వేమన

అటవీశాఖ అధికారుల అదుపులో వేటగాళ్లు

- పంగోలిన్‌ను అమ్మకానికి పెట్టారనే అనుమానంతో అదుపులోకి


పంగోలిన్ (ఫైల్)

పెద్దదోర్నాల: మండల పరిధిలోని నల్లమల అభయారణ్యంలో సంచరించే పంగోలిన్ (అలుగు)ను వేటాడి అమ్మకానికి పెట్టారనే అనుమానంతో మండలానికి చెందిన కొందరు వ్యక్తులను అటవీశాఖ అధికారుల అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆ వివరాల మేరకు.. మండల పరిధిలోని సుందరయ్యకాలనీ, జమ్మిదోర్నాల, చింతల, చిన్నగుడిపాడుకు చెందిన కొందరు వ్యక్తులు నల్లమల అభయారణ్యంలో సంచరించే అలుగును వేటాడి కొందరు దళారుల ద్వారా అమ్మకానికి పెట్టినట్లు సమాచారం అందడంతో అటవీశాఖ ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. మార్కాపురం డీఎఫ్‌ఓ ఆదేశాలతో వారం రోజుల నుంచి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో అటవీశాఖ అధికారులతో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి దేవాలయం వద్ద మండలానికి చెందిన పలువురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని ధ్రువీకరించేందుకు అటవీశాఖ అధికారులు నిరాకరించారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తుల వద్ద పంగోలిన్ (అలుగు) దొరకలేదని, దానిపై అనుమానితులను విచారిస్తున్నారని సమాచారం. ఈ దాడుల్లో మార్కాపురం, యర్రగొండపాలెం, గంజివారిపల్లె బీట్ల అధికారులు పాల్గొన్నట్లు తెలిసింది.

కంభంలో చోరీ

- 6 తులాల బంగారు నగలు, రూ.5 వేల నగదు అపహరణ

కంభం: తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడిన సంఘటన శనివారం రాత్రి కంభంలో చోటుచేసుకుంది. స్థానిక గణేష్‌నగర్‌లో నివాసం ఉంటున్న ముత్యపోగు దయాన ఈ నెల 1వ తేదీ గిద్దలూరు మండలం దేవనగరంలోని పుట్టింటికి వెళ్లింది. శనివారం రాత్రి తిరిగి ఇంటికి రాగా, ఇంటికి వేసిన తాళం పగలగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా, ఇంట్లోని బీరువా పగలగొట్టి అందులోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో పోలీసులకు సమాచారం అందించింది. కంభం సీఐ మల్లికార్జునరావు, ఎస్సై నరసింహారావు చోరీ జరిగిన గృహాన్ని పరిశీలించి బాధితురాలితో మాట్లాడి వివరాలు సేకరించారు. మార్కాపురం క్లూస్ టీమ్ బృందం దొంగతనం జరిగిన ఇంట్లో వేలిముద్రలు సేకరించింది. బీరువాలో ఉన్న 9 బంగారపు ఉంగరాలు, బంగారు నక్లీసు, కమ్మలు, చెయిను కలిపి మొత్తం సుమారు 6 తులాల బంగారు నగలు, రూ.5 వేల నగదు అపహరించుకెళ్లినట్లు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.


దొంగలు పగలగొట్టిన బీరువా

ఇటీవల కాలంలో కంభం పట్టణంలో వరుస దొంగతనాలు జరుగుతుండటం పట్టణవాసులకు ఆందోళన కలిగిస్తోంది.


బాధితురాలితో మాట్లాడుతున్న సీఐ, ఎస్సైలు


వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

పోలీసులు దొంగతనాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వ్యవసాయశాఖ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుని ఎన్నిక

ఒంగోలు: ఏపీ వ్యవసాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షునిగా ఎం.వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా వి.శివచంద్రశేఖర్, కోశాధికారిగా ఆర్.జయరావును ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించారు. సంఘ కర్నూలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రవిప్రకాశరావు, ఎంసీ కాశన్నలు ఎన్నికల అధికారులుగా వ్యవహరించగా, రాష్ట్ర అధ్యక్షులు పీవీ సాయికుమార్, ప్రధాన కార్యదర్శి ఎ.రవికుమార్, ఉపాధ్యక్షులు ఎం.శ్రీమన్నారాయణ, ఎస్.పాపారావు, జిల్లా ఎన్‌జీవో సంఘ అధ్యక్షుడు శరత్‌బాబు, కార్యదర్శి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

మూలగుంటపాడులో భారీ చోరీ

- సుమారు రూ.40 లక్షల విలువైన బంగారం, వెండి, నగదు అపహరణ
- చోరీపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్న పోలీసులు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఒంగోలు డీఎస్పీ, సింగరాయకొండ సీఐ

సింగరాయకొండ:

మండలంలోని మూలగుంటపాడు పంచాయతీలో హెచ్‌పీ గ్యాస్ సమీపంలోని ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. స్థానికంగా నివసిస్తున్న ఎల్‌ఐసీ ఏజెంట్ పొత్తూరి శ్రీరామమూర్తి ఇంట్లో సుమారు రూ.40 లక్షల విలువైన బంగారం, నగదు, వెండి అపహరణకు గురైన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఈ చోరీపై పోలీసులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్‌ఐసీ ఏజెంట్ శ్రీరామమూర్తి మామకు తీవ్ర అస్వస్థతగా ఉండటంతో గత నెల చివరివారంలో భార్య సుభాషిణి నెల్లూరు వెళ్లారు. ఈ నెల 1వ తేదీ శ్రీరామమూర్తి కూడా నెల్లూరు వెళ్లారు. ఆదివారం కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో నెల్లూరు నుంచి వచ్చిన శ్రీరామమూర్తి ఇంటి తలుపులు తెరిచి లోపలికి వెళ్లగా వంటగదిలోని కిటికీ తెరిచి ఇనుక గ్రిల్ కూడా తొలగించి ఉంది. చోరీ జరిగిందని నిర్ధారించుకుని బెడ్‌రూమ్‌లో ఉన్న అల్మారాలో చూడగా, 47 సవర్ల బంగారం, 11 కేజీల వెండి, రూ.3 లక్షల నగదు కనిపించలేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు.

వెంటనే రంగంలోకి దిగిన సింగరాయకొండ సీఐ సీహెచ్ హజరత్తయ్య, ఎస్సై బి.మహేంద్ర, ఏఎస్సైలు శేషారెడ్డి, షేక్ మహబూబ్‌బాషా, పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని చోరీ జరిగిన విధానాన్ని పరిశీలించారు. వంటగదిలోని కిటికీకి ఉన్న ఇనుప గ్రిల్ తీసి లోపలికి ప్రవేశించిన దొంగలు.. బెడ్‌రూమ్‌లోకి వెళ్లి నగలు, నగదు చోరీ చేశారని నిర్ధారించుకున్నారు. అయితే, బెడ్‌రూమ్‌లో ఎక్కడి వస్తువులు అక్కడే ఉండటం, అల్మరాలోని ప్లాస్టిక్ బాక్స్‌లు సర్దిపెట్టి ఉన్న నగదు, నగలు చోరీ జరగటం, అల్మారా తలుపులకు తాళాలు తగిలించి ఉండటంపై పోలీసులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ చోరీ బయటి వ్యక్తులు చేసింది కాదని, ఇంట్లోని వారే పకడ్బందీగా చేశారని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. తమ అనుమానాల నివృత్తి కోసం శ్రీరామమూర్తి భార్య సుభాషిణిని నెల్లూరు నుంచి పిలిపించి విచారించారు. కేసు నమోదు చేశామని, దర్యాప్తులో వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉందని ఎస్సై బి.మహేంద్ర తెలిపారు. అనంతరం ఘటన స్థలాన్ని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సీసీఎస్ సీఐ దాచేపల్లి రంగనాథ్‌లు వారి సిబ్బందితో కలిసి పరిశీలించారు. క్లూస్‌టీం సభ్యులు వేలిముద్రలు సేకరించారు. ఇంటి పరిసరాలను డాగ్ స్క్వాడ్ పరిశీలించింది. టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ భాస్కరలింగం, సిబ్బంది పాల్గొన్నారు.


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు


వంటగది కిటికీ ఇనుప గ్రిల్‌ను దొంగలు తొలగించిన దృశ్యం